సాక్షి మంచిర్యాల

ఆదివారం ¦ 7 ¦ జనవరి ¦ 2024



సైబర్ దోపిడీ!

నులువుగా డబ్బు వస్తుందని అత్యాశపడితే అసలుకే మోసం వస్తుంది. లక్కీడ్రా తగిలిందనో.. గిఫ్ట్ కూపన్ గెలుచుకున్నారనో చెబుతూ సైబర్ మాయగాళ్లు వల వేస్తున్నారు. 8లో▸



టేస్టీ.. 'మిల్లెట్' ఫుడ్..!

ఆధునిక జీవనశైలి, ఉరుకులు, పరుగుల జీవితంలో వ్యాధులు చుట్టుముడుతున్నాయి. దీంతో ప్రజలు ఆరోగ్యాన్ని అందించే 'మిల్లెట్' ఆహారంపై మొగ్గు చూపుతున్నారు. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 29.0 /17.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. నైరుతి దిశగా చలిగాలులు వీస్తాయి. పొగమంచు కురుస్తుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి.

న్యూస్‌రీల్

జిల్లా జడ్జిని కలిసిన కలెక్టర్



జిల్లా జడ్జికి మొక్కను అందజేస్తున్న కలెక్టర్

మంచిర్యాలక్రైం: జిల్లా న్యాయమూర్తిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన బి.శ్రీనివాసులును జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. పూలమొక్కను అందజేశారు. అనంతరం జిల్లా స్థితిగతులు, నేరాలపై సమీక్షించారు.

రేపు అప్రెంటిస్‌షిప్ మేళా

మంచిర్యాలఅర్బన్: శ్రీరాంపూర్ ఐటీఐలో ఈ నెల 8న స్కీడర్ ఎలక్ట్రిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో పీఎం నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహిస్తున్నట్లు మంచిర్యాల ఐటీఐ ప్రిన్సిపాల్ చందర్ తెలిపారు. స్కీడర్ ఎలక్ట్రిక్ ఇండియా కంపెనీలో ఎలక్ట్రీషియన్-30, ఎలక్ట్రానిక్స్ మెకానిక్-30, ఫిట్టర్-20, కోపా-10 ఖాళీలు ఉన్నాయని వివరించారు. ఎంపికైన అభ్యర్థులకు ప్రతినెలా రూ.11 వేల స్టైఫండ్, ఉచిత రవాణా, క్యాంటీన్ సదుపాయం ఉంటుందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు మంచిర్యాల, శ్రీరాంపూర్ ఐటీఐలో సంప్రదించాలని సూచించారు.

చెకుముకి టాలెంట్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఈవో యాదయ్య

మంచిర్యాలఅర్బన్: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ పోస్టర్‌ను డీఈవో యాదయ్య శనివారం ఆవిష్కరించారు. ఈ నెల 19న పాఠశాల, 27న మండల, ఫిబ్రవరి 3న జిల్లా, 9, 10, 11వ తేదీల్లో రాష్ట్రస్థాయి పోటీలు ఉంటాయని తెలిపారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి కిష్టయ్య, డీఎస్‌వో మధుబాబు, దేవన్న తదితరులు పాల్గొన్నారు.

18లోపు ప్రాజెక్టు వీడియో, ఫొటోలు అప్‌లోడ్ చేయాలి

మంచిర్యాలఅర్బన్: ఆన్‌లైన్ ద్వారా నిర్వహించే జిల్లాస్థాయి ఇన్‌స్పైర్, బాల వైజ్ఞానిక ప్రదర్శనకు సంసిద్ధులు కావాలని డీఈవో యాదయ్య సూచించారు. 2022-23 సంవత్సరానికిగాను ఇన్‌స్పైర్ మనక్ అవార్డుకు ఎంపికైన 102 మంది విద్యార్థులకు జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ ప్రదర్శనలు ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఏటా నిర్వహించే బాల వైజ్ఞానిక ప్రదర్శన (వైజ్ఞానిక, గణిత, పర్యావరణ, ప్రదర్శన ఎగ్జిబిషన్) రెండు కార్యక్రమాలు ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు 18లోపు ప్రాజెక్టు వీడియో, ఫొటోలు తప్పక నమోదు చేయాలని సూచించారు.

వందుర్‌గూడలో ప్రజాపాలన బహిష్కరణ



ప్రజాపాలనను బహిష్కరిస్తూ వినతిపత్రం

దండేపల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని మండలంలోని వందుర్‌గూడలో గ్రామస్తులు శనివారం బహిష్కరించారు. గత ప్రభుత్వ హయాంలో వందుర్‌గూడను ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేశారు. పంచాయతీగా రద్దు చేసి పాత పంచాయతీ నెల్కివెంకటాపూర్‌లో కొనసాగించాలని అప్పటి నుంచే గ్రామస్తులు ఆందోళనలు నిర్వహిస్తున్నారు. ఆందోళనలతోపాటు ప్రభుత్వ కార్యక్రమాలను బహిష్కరిస్తూ వస్తున్నారు. వందుర్‌గూడ పంచాయతీని రద్దు చేసి పాత పంచాయతీ నెల్కివెంకటాపూర్‌లో కొనసాగించే వరకు ఎలాంటి ప్రభుత్వ కార్యక్రమాలను గ్రామంలో నిర్వహించబోమని స్పష్టం చేశారు. ప్రజాపాలన కార్యక్రమాన్ని కూడా బహిష్కరిస్తున్నామని, ఎంపీడీవో మల్లేశంకు వినతిపత్రం అందజేశారు. అధికారులు పంచాయతీ కార్యాలయం వద్ద సాయంత్రం వరకు వేచి ఉన్నా ఏ ఒక్కరు దరఖాస్తు చేసుకోకపోవడంతో వెనుదిరిగారు.

నామినేటెడ్ ఆశలు



- పదవుల కోసం కాంగ్రెస్ పార్టీలో పోటాపోటీ
- తమకు అవకాశం కల్పించాలని వినతులు
- రాష్ట్ర పెద్దలను కలుస్తున్న జిల్లా నేతలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: రాష్ట్రంలో పదేళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఆ పార్టీ నాయకులు నామినేటెడ్ పోస్టులపై ఆశలు పెంచుకుంటున్నారు. త్వరలోనే ఖాళీగా ఉన్న స్థానాలను భర్తీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని నాయకులు పదవులు దక్కించుకునేందుకు తమ ప్రయత్నాలు చేస్తున్నారు. మొదటి నుంచి పార్టీలో కష్టపడి పని చేసిన వారికి సముచిత గుర్తింపు దక్కేలా చూస్తామని పార్టీ పెద్దలు చెబుతున్నారు. ఈ క్రమంలో జిల్లా నుంచి అనేకమంది పార్టీలో పని చేస్తున్న వారు తమకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. ఎవరికి ఏ పదవులు వస్తాయోనని అందరిలోనూ ఆసక్తి నెలకొంది. రాష్ట్ర స్థాయిలో ఎమ్మెల్సీ పదవీతోపాటు 50కి పైగా కార్పొరేషన్ల చైర్‌పర్సన్‌లు, రాజ్యాంబద్ధ సంస్థలైన టీఎస్‌పీఎస్సీ, సమాచారశాఖ, ఇతర సంస్థల్లో అవకాశాలు ఉంటాయి. వీటితోపాటు జిల్లా గ్రంథాలయాల సంస్థ, మార్కెట్ కమిటీలు, సహకార, డీసీఎంఎస్, డీసీసీబీ చైర్మన్‌లు ఇతరత్రా వాటిలో అవకాశాలు ఉంటాయి.

ఆశావహులు అనేకం

కాంగ్రెస్ పార్టీలో నామినేటెడ్ పదవుల ఆశావహులు అనేకమంది ఉన్నారు. బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, కేవీ ప్రతాప్ నామినేటెడ్ పదవుల ప్రాధాన్యత వరుసలో ప్రథమంగా ఉన్నారు. ఒకవేళ ఓదెలుకు వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో పెద్దపల్లి లోక్‌సభ స్థానం నుంచి పోటీకి అవకాశం కల్పిస్తే ఆయన స్థానంలో మరొకరితో పదవీ భర్తీ చేసే అవకాశం ఉండొచ్చు. వీరితోపాటు సీనియర్ నాయకులు గోమాసే శ్రీనివాస్, చిట్ల సత్యనారాయణ, అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్లు ఆశించిన నాతరి స్వామి, చిలుముల శంకర్, రొడ్డ శారద, నూకల రమేశ్, రామిళ్ల రాధిక, దుర్గం భాస్కర్, డాక్టర్ నీలకంఠేశ్వర్ తదితరులు ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘం ఐఎన్‌టీయూసీ నుంచి కార్మిక నాయకులు సైతం ఏళ్లుగా పార్టీలోనే పని చేస్తున్నారు. కోల్‌బెల్ట్ పరిధి, ఎన్‌ఎస్‌యూఐ నుంచి విద్యార్థి, యువజన, మహిళా, కిసాన్ విభాగాల్లో కీలకంగా పని చేసిన వారికి మొదట ప్రాధాన్యం ఇచ్చే అవకాశం ఉంది. మరోవైపు చెన్నూర్ అసెంబ్లీ టికెట్ దక్కని సమయంలోనే నూకల రమేశ్‌కు జెడ్పీ చైర్‌పర్సన్‌గా అవకాశం ఇస్తామనే హామీలు ఇచ్చారు. ఇలా కొందరికి ఎన్నికల సమయంలోనే అసంతృప్తిని చల్లార్చేందుకు భవిష్యత్‌లో పదవులు ఇచ్చి గుర్తింపునిస్తామని హామీనిచ్చారు. అలాంటి వారంతా ఇప్పుడు ఆతృతగా ఎదురు చూస్తున్నారు. మరోవైపు ఆరు గ్యారంటీ పథకాలు అమలుకు ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయనున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రతీ గ్రామానికి, పట్టణాల్లో వార్డులకు ఐదుగురి చొప్పున ఏర్పాటు చేయనున్నారు. మండల, గ్రామ స్థాయి నాయకులకు ఈ కమిటీల్లో ప్రాధాన్యం ఇచ్చే అవకాశం ఉంది.

ఎమ్మెల్యేలు సూచించిన వారికే..

కాంగ్రెస్ పార్టీలో విధేయత, సీనియార్టీ, కష్టపడి పని చేయడంతోపాటు స్థానిక ఎమ్మెల్యేల సిఫారసు సైతం నామినేటెడ్ పోస్టుల్లో కీలకం కానుంది. తమ తమ నియోజకవర్గాల్లో పదవులు భర్తీ చేయడంపై అధికార పార్టీ ఎమ్మెల్యేలు సూచించిన వారికి అధిష్టానం ప్రాధాన్యత ఇవ్వనుంది. ఈ క్రమంలో జిల్లా పరిధిలో ఉన్న నాలుగు నియోజకవర్గాల్లో ఆయా ఎమ్మెల్యేలు, గాంధీభవన్ పెద్దల ఆశీర్వాదం ఉంటే నామినేటెడ్ పదవులు దక్కే అవకాశం ఉందని ఆ పార్టీ నాయకులే చెబుతున్నారు. అందుకోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.

నాయకుల ప్రయత్నాలు

నామినేటెడ్ పదవుల్లో తమకు అవకాశం కల్పించాలని కోరుతూ ఇప్పటికే హైదరాబాద్‌లో గాంధీభవన్ చుట్టూ జిల్లాకు చెందిన ఆశావహులు ప్రయత్నాలు చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ ఆశించిన వారు సైతం సీఎం, డిప్యూటీ సీఎం, రాష్ట్ర స్థాయి ముఖ్యులను కలుస్తూ తమ అవకాశాల కోసం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ పోటీలో మహిళా నాయకులు సైతం ఉన్నారు. లోక్‌సభ ఎన్నికల ముందే భర్తీ చేస్తామని చెబుతున్న క్రమంలో వీలు చిక్కినప్పుడల్లా పార్టీ పెద్దలను కలుస్తూ వస్తున్నారు. అంతేకాక తమకు తెలిసిన వారి పరిచయాలతో పదవుల కోసం పోటీ పడుతున్నారు. ప్రతీ నియోజకవర్గం పరిధిలో దాదాపు నలుగురు నుంచి ఐదుగురి మధ్య తీవ్రంగా పోటీ ఉంది. జిల్లాలో ఎంత మందికి పదవుల్లో అవకాశాలు దక్కుతాయో తెలియనప్పటికీ అందరూ ఆశలు పెట్టుకుని ఉన్నారు.

'ఆమె'పైనే కు.ని భారం



వేసెక్టమీ అవగాహన పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో సుబ్బరాయుడు (ఫైల్)

- వేసెక్టమీకి పురుషుల వెనుకడుగు
- ఆపరేషన్‌పై తొలగని అపోహలు
- ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు

మంచిర్యాలటౌన్: కుటుంబ నియంత్రణ అంటే మహిళలకు మాత్రమే కాదు.. పురుషులూ ముందుకు రావాలని జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న అవగాహన కార్యక్రమాలకు పెద్దగా స్పందన రావడం లేదు. వేసెక్టమీ చేయించుకునేందుకు పురుషులు వెనుకడుగు వేస్తున్నారు. నవమాసాలు బిడ్డను మోసి, పురిటి నొప్పులు భరించి, కడుపుకోత తట్టుకునే 'ఆమె' కడుపునకే మళ్లీ కోత పడుతోంది. పిల్లలు పుట్టకుండా నిర్వహించే కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స బాధ్యతను చాలామంది పురుషులు భార్యపైనే మోపుతున్నారు. దీంతో వారికి ఒకటికి, రెండుసార్లు ఆపరేషన్ తప్పడం లేదు. కు.ని చేయించుకునే పురుషులకు కోత, కుట్టు లేని వేసెక్టమీ ఆపరేషన్ ఐదు నిమిషాల్లోనే పూర్తి చేస్తారు. కొద్దిపాటి విశ్రాంతి అనంతరం రెండు, మూడు రోజుల్లోనే సాధారణ స్థితికి చేరుకుంటారు. కానీ.. మహిళకు ట్యూబెక్టమీ ఆపరేషన్ చేయిస్తే 10 రోజులపాటు ఇబ్బంది పడడమే కాకుండా భవిష్యత్‌లో సమస్యలు ఎదుర్కొనే అవకాశం ఉంది. ఈ విషయం తెలిసినా పురుషులు కు.ని. ఆపరేషన్లకు దూరంగా ఉంటుండగా, ఆ భారాన్ని మహిళలే భరించాల్సి వస్తోంది. ఇక వేసెక్టమీ శస్త్రచికిత్స చేయించుకునేలా పురుషులకు అవగాహన కార్యక్రమాలు ఏటా జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నా మహిళలతో పోలిస్తే పురుషులు తక్కువ సంఖ్యలోనే ముందుకు వస్తున్నారు. జిల్లాలో వేసెక్టమీ చేసేందుకు అవసరమైన వైద్యుడు లేకపోవడమూ పురుషులు ఆపరేషన్లకు ముందుకు రాకపోవడానికి ఓ కారణంగా తెలుస్తోంది.

ఆరేళ్లలో చేసిన ట్యూబెక్టమీ, వేసెక్టమీ ఆపరేషన్ల వివరాలు

సంవత్సరం	ట్యూబెక్టమీ	వేసెక్టమీ
2018-19	3,402	57
2019-20	2,814	177
2020-21	2,156	128
2021-22	2,655	204
2022-23	2,423	37
2023-24	1,730	4+

అవగాహన కల్పించాం



కుటుంబ నియంత్రణ ఆపరేషన్ మహిళల కంటే పురుషులు చేసుకోవడమే మంచిది. ఇటీవల జిల్లాలో వేసెక్టమీపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. ముందుకు వచ్చిన వారిని ఈ నెల నుంచి మే వరకు శిబిరాలు ఏర్పాటు చేసి పురుషులకు వేసెక్టమీ ఆపరేషన్లు చేస్తాం. ఏటా కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌కు మహిళల కంటే పురుషులే ముందుకు రావాలని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– సుబ్బరాయుడు, డీఎంహెచ్‌వో

పురుషులకే సులభంగా..

కుటుంబ నియంత్రణ పద్ధతుల్లో పురుషులకు చేసే వేసెక్టమీ శస్త్రచికిత్స చాలా సులభం. కోత, కుట్టు లేని శస్త్ర చికిత్స ఇది. ఐదు నుంచి పది నిమిషాల్లోనే పూర్తయ్యే ఈ విధానంలో రక్త స్రావం ఉండదు. శస్త్రచికిత్స అయిన వెంటనే చిన్నచిన్న పనులు కూడా చేసుకోవచ్చని వైద్యులు పేర్కొంటున్నారు. రెండు, మూడు రోజుల్లోనే పనులు చేసుకునేందుకు అవకాశం ఉంది. పురుషులకు గతంలో కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స చేయాలంటే తప్పనిసరిగా కోత పెట్టాల్సి వచ్చేది. ఆధునిక విధానమైన నో స్కాల్‌పల్ వేసెక్టమీ(ఎన్‌ఎస్‌వీ) అందుబాటులోకి రావడంతోపాటు ల్యాప్రోస్కోపిక్ పద్ధతిలోనూ నిర్వహిస్తున్నారు. ఈ విధానంలో చేసే ఆపరేషన్‌కు పురుషులు కొంతసేపు విశ్రాంతి తీసుకుని ఇంటికి వెళ్లేందుకు అవకాశం ఉంది. అదే మహిళలు ట్యూబెక్టమీ చేయించుకుంటే భవిష్యత్‌లో ఎన్నో దుష్పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. శస్త్రచికిత్స సమయంలో కూడా కడుపు కోత పెట్టాల్సి ఉండడంతో రక్తస్రావం అయ్యే ప్రమాదం ఉంది. కుట్లు మానడానికి దాదాపు వారం పది రోజులు పడుతుంది. దాదాపు ఆరునెలల వరకు బరువైన పనులు చేయడం కష్టంగా ఉంటుంది. అప్పటికే ఒకటి, రెండు కాన్పులు శస్త్రచికిత్స ద్వారా జరిగితే ఆ మహిళలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ మరిన్ని ఇబ్బందులు తెచ్చిపెట్టే ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు. భార్యాభర్తలిద్దరిలో ఎవరైనా ఒకరు చేయించుకునే అవకాశం ఉన్నా.. అనాదిగా ఈ శస్త్రచికిత్సను మహిళలకే పరిమితం చేస్తుండడం, సమాజంలో మూఢాచారానికి అద్దం పడుతోంది. నిత్యం బయటి పనులకు వెళ్లి కాయకష్టం చేసే పురుషులు భవిష్యత్‌లో ఆరోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్న అపోహ ఇంకా ప్రజల్లో నాటుకుపోయి ఉండగా.. దానిని తొలగించేందుకు వైద్యారోగ్యశాఖ ఏటా వేసెక్టమీపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఈ ఏడాది 'కుటుంబ నియంత్రణలో పురుష భాగస్వామ్యం అందించడం తల్లీబిడ్డలకు ఆరోగ్యం' అనే నినాదంతో ముందుకు వెళ్తోంది.

27న ప్రత్యేక వైద్య శిబిరం

- న్యాయమూర్తి బి.శ్రీనివాసులు

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 27న సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ న్యాయమూర్తి బి.శ్రీనివాసులు అన్నారు. శనివారం కలెక్టర్ చాంబర్‌లో హైదరాబాద్ డిస్ట్రిక్ట్ కన్స్యూమర్ డిస్ప్యూట్స్ రెడ్ సెల్ కమిషన్ సభ్యురాలు మాధవి శానకోట, జిల్లా కలెక్టర్ బి.సంతోష్‌తో కలిసి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి సుబ్బరాయుడుతో వైద్య శిబిరం నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ వైద్య శిబిరం నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని, వైద్యాధికారులు, వైద్యులు, సిబ్బంది, మందులు అందుబాటులో ఉంచాలని, గుండె సంబంధిత పరీక్షలతోపాటు అన్ని రకాల వైద్య పరీక్షలు చేయాలని తెలిపారు. ఐఎంఏను సమన్వయం చేసుకోవాలని, ఎలాంటి సమస్యలు లేకుండా శిబిరం నిర్వహించాలన్నారు. కలెక్టరేట్ ఏవో రాజేశ్వర్, వైద్యాధికారి ఫయాజ్, మాస్ మీడియా అధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



జడ్జికి పూల మొక్క అందజేస్తున్న కలెక్టర్

పొరపాట్లకు తావివ్వొద్దు

- ఆన్‌లైన్ ఎంట్రీలో జాగ్రత్తలు వహించాలి
- జిల్లా కలెక్టర్ బి.సంతోష్



మున్సిపల్ కార్యాలయంలో ఆన్‌లైన్ ఎంట్రీ పరిశీలిస్తున్న కలెక్టర్ బి.సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రజాపాలన దరఖాస్తుల వివరాలను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ బి.సంతోష్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని మంచిర్యాల మున్సిపల్ కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తుల ప్రక్రియతోపాటు ఆన్‌లైన్‌లో వివరాల నమోదు తీరును మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన డిసెంబర్ 28 నుంచి ఈ నెల 6 వరకు కొనసాగిందని, 6 నుంచి 17వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని తెలిపారు. నమోదుపై తహసీల్దార్లు, మున్సిపల్ వార్డు అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ ఇచ్చామని అన్నారు. వార్డుల వారీగా దరఖాస్తు సంఖ్య నమోదు చేసిన అనంతరం కులం, పుట్టిన తేదీ, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, మొబైల్ నంబర్, కుటుంబ సభ్యుల వివరాలు, చిరునామా ఇతర వివరాలతో కూడిన ఆన్‌లైన్ ఫారంలో ఎంట్రీ చేస్తారని అన్నారు. అభయహస్తం గ్యారంటీ పథకాలు, మహాలక్ష్మి, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత, రైతుభరోసా వివరాలు దరఖాస్తు ఫారంలో నమోదు చేసిన విధంగానే ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయాలని ఆపరేటర్లకు సూచించారు.

ముగిసిన దరఖాస్తుల స్వీకరణ

- జిల్లాలో 2,83,249 అర్జీలు
- ఇక మిగిలింది ఆన్‌లైన్

మంచిర్యాలఅగ్రికల్చర్: సంక్షేమ పథకాల అర్హుల ఎంపికకు ప్రజాపాలన పేరుతో చేపట్టిన దరఖాస్తుల స్వీకరణ శనివారం ముగిసింది. గత డిసెంబర్ 28నుంచి ప్రారంభం కాగా ఎనిమిది రోజులపాటు కొనసాగింది. జిల్లా వ్యాప్తంగా 16మండలాల్లోని 311 గ్రామ పంచాయతీల్లో, ఏడు మున్సిపాలిటీల్లోని 174 వార్డుల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ప్రజలు 2,83,249 దరఖాస్తులు సమర్పించారు. మండలాల్లో మొత్తంగా 1,75,511, మున్సిపాలిటీల్లో 1,07,738 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో ఐదు గ్యారంటీ పథకాలకు సంబంధించిన దరఖాస్తులు కాకుండా రేషన్‌కార్డు, భూ సమస్యలు, తదితర వాటికి 32,660 దరఖాస్తులు అందజేశారు. రైతు భరోసా, ఆసరా పింఛన్ పొందుతున్న వారు దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని ప్రకటించడంతో తక్కువ సంఖ్యలో అర్జీలు వచ్చాయి.

ఆన్‌లైన్‌లో ఎంట్రీ ప్రారంభం..

ప్రజాపాలన కార్యక్రమాల్లో వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియను జిల్లా వ్యాప్తంగా శనివారం ప్రారంభించారు. మున్సిపాలిటీలు, ఎంపీడీవో కార్యాలయాలు, ఇతర శాఖల్లో పనిచేసే కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ ఇచ్చి నమోదు బాధ్యత అప్పగించారు. లక్షల సంఖ్యలో అర్జీలు రావడంతో ప్రైవేట్ సిబ్బంది సైతం ఉన్నారు. దరఖాస్తుల్లో ప్రజలు పొందుపరిచిన వివరాలు ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేసేలా సూచనలు చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆపరేటర్లు 500 మంది దరఖాస్తుల్లోని సమాచారాన్ని ఉదయం నుంచి సాయంత్రం, రాత్రి వరకు రెండు షిఫ్టుల వారీగా ఎంట్రీ చేయనున్నారు. తహసీల్దార్లు, ఎంపీడీవోలు పర్యవేక్షిస్తున్నారు. ఒక బృందం రోజు వెయ్యి దరఖాస్తుల వరకు అప్‌లోడ్ చేస్తున్నారు. ఈ నెల 17లోగా ఆన్‌లైన్ ఎంట్రీ పూర్తి చేసేలా చర్యలు చేపట్టారు.

నీటిని సద్వినియోగం చేసుకోవాలి



నీటి విడుదల పూజల్లో కలెక్టర్, ఎమ్మెల్యే

దండేపల్లి: మండలంలోని గూడెం సత్యనారాయణస్వామి ఎత్తిపోతల పథకం నీటిని ఆయకట్టు రైతులు యాసంగి సాగు కోసం సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. తానిమడుగు వద్ద శనివారం నిర్వహించిన ఎత్తిపోతల నీటి విడుదల పూజ కార్యక్రమంలో మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డీ-30 నుంచి 42 వరకు వారబందీ పద్ధతిలో నీరు అందిస్తున్నందున రైతులు సహకరించుకోవాలని తెలిపారు. ఎల్లంపల్లి ప్రాజెక్టుతోపాటు గూడెం ఎత్తిపోతల పథకం అధికారులు సమన్వయంతో పనిచేసి సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే పరిష్కరించాలని తెలిపారు. ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు మాట్లాడుతూ రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. వానాకాలంలో పండించిన వరి ధాన్యం కొనుగోలు విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చేయడంతోపాటు తరుగుదోపిడీని పూర్తిగా నివారించామని అన్నారు. గూడెం ఎత్తిపోతల కింద రైతులు ఆరుతడి పంటు వేసుకుంటే మంచిదన్నారు. ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, జెడ్పీటీసీ నాగరాణి, సర్పంచ్ ప్రేమల, తహసీల్దార్ సంధ్యారాణి, ఇరిగేషన్ అధికారులు, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన కౌన్సిలర్లు

- పదికి చేరిక సంఖ్య
- అవిశ్వాసంపై కలెక్టర్‌కు నోటీసు



కలెక్టర్‌కు నోటీసు ఇస్తున్న కౌన్సిలర్‌లు

లక్సెట్టిపేట: పట్టణంలోని బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన రెండో వార్డు కౌన్సిలర్ గడికొప్పుల ఉమాదేవి, 15వ వార్డు కౌన్సిలర్ షబానా శనివారం మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఆయన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత బీఆర్‌ఎస్ పార్టీ నుంచి పలువురు ఇప్పటికే కాంగ్రెస్ పార్టీలో చేరారు. మున్సిపాలిటీలో మొత్తం 15వార్డులు ఉన్నాయి. గతంలో ఇద్దరు, ప్రస్తుతం ఇద్దరి చేరికతో కాంగ్రెస్ పార్టీ సభ్యుల సంఖ్య పదికి చేరింది. చైర్మన్ నల్మాసు కాంతయ్య, వైస్ చైర్మన్ పొడేటి శ్రీనివాస్‌గౌడ్‌పై అవిశ్వాసాన్ని ప్రతిపాదిస్తూ కలెక్టర్ సంతోష్‌కు నోటీసు అందజేశారు. మరికొందరి మద్దతు కూడగట్టే ప్రయత్నాలు చేస్తున్నారు.

ఓసీసీలో వేడెక్కుతున్న రాజకీయం



ఎమ్మెల్యేను అడ్డుకుని ఆదివాసీల నిరసన

కాసిపేట: మండలంలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీలో గుర్తింపు సంఘం ఎన్నికల రాజకీయం వేడెక్కుతోంది. ఇంకా ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కాకముందే రాజకీయాలు, నిరసనలతో రసవత్తరంగా మారింది. ఈ నెల 8న డెప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ ఆదిలాబాద్ ఆధ్వర్యంలో రెండో సమావేశం మంచిర్యాలలో నిర్వహించనున్నారు. గుర్తింపు సంఘం అధ్యక్షుడు, బీఆర్‌ఎస్ నాయకుడు పూస్కూరి రాంమోహన్‌రావు పోటీలో ఉండగా, అదే యూనియన్‌కు చెందిన సోయం సూరు సైతం పోటీలో ఉన్నట్లు ప్రచారం చేసుకుంటున్నారు. మాజీ ఎమ్మెల్సీ, కాంగ్రెస్ నాయకుడు రాములు నాయక్ సైతం పోటీలో ఉండేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు తన సోదరుడు సత్యపాల్‌రావు(చిట్టిబాబు)ను బరిలో నిలిపేందుకు సిద్ధమయ్యారు. దీంతో రాములునాయక్‌కు ఎమ్మెల్యేలు వివేక్, వినోద్ మద్దతు ఇస్తుండడం చర్చనీయాంశమైంది. ప్రేంసాగర్‌రావు తండ్రి రఘుపతిరావు పలుమార్లు యూనియన్ తరఫున గుర్తింపు సంఘం అధ్యక్షుడిగా పని చేశారు. వారి కుటుంబానికి కార్మికుల్లో గుర్తింపు ఉంది.

ఎమ్మెల్యేను అడ్డుకున్న ఆదివాసీలు

ఎన్నికల నేపథ్యంలో దేవాపూర్‌లో రాములునాయక్ తరఫున సమావేశం నిర్వహణకు ఎమ్మెల్యే గడ్డం వినోద్ శనివారం రాగా ఆదివాసీలు అడ్డుకున్నారు. ఆదివాసీలకు అన్యాయం చేస్తారా అని ప్రశ్నించడంతో అధిష్టానం, సీతక్కతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని నచ్చజెప్పి వెనుదిరిగారు.

సైన్స్‌పై విద్యార్థులకు అవగాహన ప్రదర్శన



సైన్స్ ప్రదర్శనలో సిబ్బంది, విద్యార్థులు

జన్నారం: మండలంలోని ధర్మారం గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన ప్రదర్శన నిర్వహించారు. సైన్స్ అధికారి మధుబాబు పర్యవేక్షణలో మానవ శరీరంలో అవయవాలు, అంతర్గత భాగాలు, అవి పని చేసే తీరు వివరించారు. భౌతిక శాస్త్ర పరికరాలు, వాటి ఉపయోగాలపై ఇన్‌స్ట్రక్టర్ సాయికుమార్ తెలియజేశారు. విద్యార్థులు శాస్త్ర సాంకేతికత వైపు అడుగులు వేసేలా చర్యలు తీసుకోవడం ఈ సంచార ప్రయోగశాల ఉద్దేశ్యమని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు తుంగూరి గోపాల్, శ్రీనివాస్, నర్సయ్య, నాగన్న, బీనా, కృష్ణవేణి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

108లో ప్రసవం


శిశువుతో 108 సిబ్బంది

పాతమంచిర్యాల: హాజీపూర్ మండలం గుడిపేటకు చెందిన సవితకు శనివారం పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. 108లో మంచిర్యాలలోని ఎంసీహెచ్‌కు తరలిస్తుండగా పురిటినొప్పులు అధికం కావడంతో పాతమంచిర్యాల సమీపంలో వాహనాన్ని నిలిపివేసి ఈఎంటీ సత్యనారాయణ ప్రసవం చేశారు. సవిత ఆడబిడ్డకు జన్మనిచ్చింది, తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్లు తెలిపారు.

సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం


దగ్ధమైన ఇల్లు

దండేపల్లి: గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధమైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. రెబ్బనపల్లికి చెందిన గోళ్ల పూర్ణచందర్ ఇంట్లో శనివారం గ్యాస్ సిలిండర్ పేలింది. గమనించిన స్థానికులు ఫైరింజన్‌కు సమాచారం అందించడంతో సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో ఇంట్లోని సామగ్రి పూర్తిగా దగ్ధమైంది. బీరువాలో దాచిన సుమారు రూ.3 లక్షల నగదు, నగలు, బట్టలు, ఇతర సామగ్రి దగ్ధమయ్యాయి. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ఘటన స్థలాన్ని తహసీల్దార్ సంధ్యారాణి, ఆర్ఐ భూమన్న సందర్శించారు. సుమారు రూ.14 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా వేశారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబం కోరుతోంది.

బైక్ ఢీకొని మేకల కాపరికి గాయాలు

మేమనపల్లి: బైక్ ఢీకొని మేకల కాపరి గాయాలపాలైన సంఘటన మండలంలోని గొర్లపల్లిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మేకల కాపరి చెండే మొండి శనివారం సాయంత్రం మేకల మందతో గ్రామంలోకి వెళ్తుండగా వేమనపల్లి నుంచి గొర్లపల్లికి వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న కన్నెపల్లి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన జలేందర్ ఢీకొట్టాడు. దీంతో మొండికి తీవ్రగాయాలు కాగా ఒక మేక సైతం మృతి చెందింది. స్థానికులు నీల్వాయి పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై సుబ్బారావు హోంగార్డును పంపించివివరాలు సేకరించారు.

కాలువలోపడి మహిళకు గాయాలు

చింతలమానెపల్లి: నిర్మాణంలో ఉన్న కాలువలో పడి మహిళకు గాయాలపై సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఇళ్లలోకి వస్తున్న వర్షపునీటిని మళ్లించేందుకు మండల కేంద్రంలోని ప్రధాన రహదారిని ఆనుకుని కాలువ నిర్మాణం చేపట్టారు. అటుగా వెళ్లిన రాజక్క కాలుజారి కాలువలో పడింది. గమనించిన స్థానికులు ఆ స్పత్రికి తరలించారు. కాలువను అసంపూర్తిగా వదిలేయడమే కాకుండా హెచ్చరిక బోర్డులు ఏ ర్పాటు చేయకుండా నిర్లక్ష్యం వహించిన అధి కారులపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సైబర్ దోపిడీ!



సులువుగా డబ్బు వస్తుందని అత్యాశపడితే అసలుకే మోసం వస్తుంది. ఒక్కసారి సైబర్ నేరస్తుల మాటల మాయలో పడితే చాలు బ్యాంకు ఖాతా ఖాళీ అవుతుంది. లక్కీడ్రా తగిలిందనో.. గిఫ్ట్ కూపన్ గెలుచుకున్నారనో.. ఒక్కసారి పెట్టుబడితో డబ్బు రెట్టింపు అవుతుందనో చెబుతూ సైబర్ మాయగాళ్లు వల వేస్తున్నారు. కొందరు ఆ వలలో చిక్కి డబ్బు పోగొట్టుకుంటున్నారు. మరికొందరు పోలీసులను ఆశ్రయించి ఎంతో కొంత వెనక్కి పొందుతున్నారు.

– సాక్షి, మంచిర్యాలడెస్క్

• అత్యాశపడితే అసలుకే మోసం • రూ.కోట్లలో ప్రజలకు టోకరా • అప్రమత్తతే రక్షణ

ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయొచ్చు..

ఆర్థిక మోసాలు, చిన్నారులు, మహిళలు, ఇతర సైబర్ నేరాలకు సంబంధించి వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. ఆర్థిక మోసాలకు సంబంధించి ఫిర్యాదు చేసే సమయంలో సంబంధిత బ్యాంకు /వాలెట్, లావాదేవీకి సంబంధించి 12అంకెల ఐడీ /యూటీఆర్ నంబరు, మోసం జరిగిన తేదీ, ఎంత మొత్తం, ఇందుకు అవసరమైన సాఫ్ట్‌కాపీ వివరాలు ఇవ్వాల్సి ఉంటుంది. https:// www. cybercrime. gov. in/ వెబ్‌సైట్ ద్వారా గానీ 1930 నంబరుకు డయల్ చేసి గానీ ఫిర్యాదు చేయవచ్చు.

పోలీసుల అవగాహన

సైబర్‌నేరాలపై పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలో సీపీ రెమా రాజేశ్వరి ఆధ్వర్యంలో జాగృతి దివాస్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ప్రతీ బుధవారం ప్రతీ పోలీసుస్టేషన్ పరిధిలో స్కూళ్లు, కాలేజీల్లో, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

కొన్ని సంఘటనలు..

- మంచిర్యాలకు చెందిన రాజ్‌కుమార్(పేరు మార్చాం) సమాజంలో పేరున్న వ్యక్తి. ఓ రోజు తన ఫేస్‌బుక్‌కు ఫ్రెండ్ రిక్వెస్ట్ రాగా ఆక్సెప్ట్ చేశాడు. అదే రోజు రాత్రి వాట్సాప్‌కు హాయ్ అంటూ మెసేజ్ రావడం, ఆ తర్వాత వీడియో కాల్ చేయడం జరిగాయి. కాల్ లిఫ్ట్ చేయగానే ఓ మహిళ నగ్నంగా కనిపించింది. ఆ తర్వాత ఫోన్ కట్ అయింది. ఇక ఇద్దరి ఫొటోలు మార్ఫింగ్ చేసి ఆ మహిళ డబ్బులు డిమాండ్ చేసింది. పరువు పోతుందనే భయంతో రూ.10వేలు పంపించాడు. అంతటితో ఆగకుండా బ్లాక్‌మెయిల్ చేయడంతో పోలీసులను ఆశ్రయించి విముక్తి పొందాడు.
- మంచిర్యాలలోని గౌతమినగర్‌కు చెందిన ఓ వ్యాపారికి లక్కీ డ్రా తగిలిందని వాట్సాప్ లింకుతో మెసేజ్ వచ్చింది. ఓపెన్ చేసి చూడగా ఓటీపీ వస్తుందని, ఓటీపీ చెప్పగానే బ్యాంకు ఖాతాలో డబ్బు జమ అవుతుందని సమాచారం ఉంది. ఓటీపీ చెప్పడంతో క్షణాల్లో అతడి బ్యాంకు ఖాతా నుంచి రూ.3.10లక్షలు డ్రా అయ్యాయి. మోసపోయానని గ్రహించిన సదరు వ్యాపారి వెంటనే సైబర్ హెల్ప్‌లైన్ నంబరు 1930కు ఫిర్యాదు చేశాడు. దీంతో సైబర్ పోలీసులు రంగంలోకి దిగి మూడు రోజుల్లోనే వ్యాపారి కోల్పోయిన నగదును ఇప్పించారు.
- ఆదిలాబాద్‌లో ఓ మహిళ ఇన్‌స్టాగాంలో లక్కీ కూపన్ వచ్చిందనే సమాచారం మేరకు మొదట రూ.20వేలు చెల్లించింది. జీఎస్టీ ఇతర సమస్యలు అంటూ రూ.80వేల వరకు సైబర్ నేరగాళ్లు వసూలు చేశారు. మోసపోయానని గ్రహించిన సదరు మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది.
- ఆదిలాబాద్‌లో ఓ వ్యక్తి ఉన్నతాధికారులకు కూపన్లను నగదుగా మార్చుకోవచ్చు. ఏవైనా వస్తువులు కొనుగోలు చేయవచ్చంటూ ఐదేసి కూపన్లు పంపించాడు. ఒక్కో కూపన్ విలువ రూ.20వేలు అంటూ నమ్మించాడు. మరో ఉన్నతాధికారి పేరిట మెసేజ్ రావడంతో నిజమని నమ్మి ఒకరు రూ.లక్ష పంపించారు. మళ్లీ మరో రెండు కూపన్లు పంపించడంతో అనుమానం వచ్చి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా గత ఏడాది 239 సైబర్ కేసులు నమోదయ్యాయి. వీటిల్లో చాలా వరకు బాధితులు డబ్బులు కోల్పోవాల్సి వచ్చింది.

- మంచిర్యాల జిల్లాలో గత ఏడాది 177 సైబర్ కేసులు నమోదయ్యాయి. ఆయా కేసుల్లో 183మంది బాధితులు రూ.1,96,76,132 పోగొట్టుకున్నారు.
- రామగుండం కమిషనరేట్ పరిధిలో ఎన్‌సీఈఆర్‌టీ పోర్టల్ ద్వారా స్వీకరించిన కేసుల్లో రూ.21,97,337 మొత్తాన్ని ఫ్రీజ్ చేశారు.
- నిర్మల్ జిల్లాలో 2022లో 41 సైబర్ కేసులు నమోదు కాగా, 2023లో 17 కేసులు నమోదయ్యాయి. గత ఏడాది బాధితులు రూ. 1,38,80,372 కోల్పోయారు. ఈ కేసుల్లో బాధితుల ఫిర్యాదు మేరకు అనుమానిత వ్యక్తుల్లోని బ్యాంకు ఖాతాల్లో రూ.25, 49,759 ఫ్రీజ్ చేశారు. రూ.5,62,175 బాధితులకు తిరిగి ఇప్పించారు.
- కుమురంభీం జిల్లాలో గత ఏడాది 26 సైబర్ కేసులు నమోదయ్యాయి. 2022 సంవత్సరంతో పోల్చి చూస్తే 2023లో సైబర్ నేరాలు 23.53శాతం తగ్గాయి.
- ఆదిలాబాద్ జిల్లాలో 2022లో 27 కేసులు నమోదు కాగా, 2023లో 19 కేసులు నమోదయ్యాయి.

వెంటనే ఫిర్యాదు చేయాలి



సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయామని గ్రహించిన వెంటనే సైబర్‌క్రైం పోలీసులకు గానీ సైబర్ క్రైం టోల్‌ఫ్రీ నంబరు 1930కు గానీ ఫిర్యాదు చేయాలి. సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి. అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్, సామాజిక మాధ్యమాల్లో వచ్చే ప్రకటనల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఉచితంగా ఏదీ రాదు. వాట్సాప్ గ్రూపుల్లో ఆశ్చర్యాన్ని కలిగించే విధంగా వచ్చే లింకులు ఓపెన్ చేయొద్దు. ఎలాంటి సమాచారం ఎవరికీ ఇవ్వొద్దు. గుర్తు తెలియని వ్యక్తుల వీడియో కాల్స్ లిఫ్ట్ చేయకూడదు. కొందరు సాధారణ కాల్స్ చేసి బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని, అకౌంట్ అప్‌డేట్ చేయాలని వివరాలు అడుగుతారు.. ఎట్టి పరిస్థితుల్లో వ్యక్తిగత సమాచారం ఇవ్వకూడదు. సైబర్ నేరగాళ్ల వేధింపులకు గురి చేస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి.

– రెమా రాజేశ్వరి, రామగుండం సీపీ

'విశ్వాసంగా పనిచేస్తాం'


మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

శ్రీరాంపూర్: ఎంతో నమ్మకంతో తమను గుర్తింపు సంఘం ఎన్నికల్లో గెలిపించినందుకు విశ్వాసంగా పనిచేస్తామని ఏఐటీయూసీ నాయకులు అన్నారు. శనివారం ఆ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీసైదా, డెప్యూటీ ప్రధాన కార్యదర్శి కే.వీరభద్రయ్య ఆర్కే 5 గనిని సందర్శించారు. ఈ సందర్భంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వారి దృష్టికి తెవడంతో యజమాన్యంతో మాట్లాడి వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ ఏరియా కార్యదర్శి ప్రసాద్ రెడ్డి, పిట్ సెక్రటరీ గునిగంటి నర్సింగరావు, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో పాత నేరస్తుల బైండోవర్


పాత నేరస్తున్ని బైండోవర్ చేసిన పోలీసులు

మంచిర్యాలక్రైం: గంజాయి కేసుల్లో పాత నేరస్తులను గుర్తించి తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేస్తున్నట్లు రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాలకు చెందిన ఏల్పుల సాయి, బెల్లంపల్లికి చెందిన ఎస్కే జమీర్, కిష్టంపేటకు చెందిన జాడి సాయి పవన్, గోదావరిఖనికి చెందిన ఎండీ అన్వర్, గుజ్జుల సాయి, మరొకరిని సంబంధిత పోలీస్ స్టేషన్ల పరిధిలోని తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు. మళ్లీ నేరాలకు పాల్పడితే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

- కాలిపోయిన 60 క్వింటాళ్ల పత్తి
- సుమారు రూ.6 లక్షల ఆస్తి నష్టం


కాలిన పత్తి

దహెగాం: మండలంలోని గిరవెల్లిలో చెందిన కొఠారి ఇస్తారి అనే రైతుకు చెందిన ఇల్లు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం శనివారం కుటుంబ సభ్యులంతా కలిసి చేనువద్దకు వెళ్లారు. మధ్యాహ్న సమయంలో ఇంట్లో మంటలు చెలరేగాయి. ఇంట్లో నిల్వ ఉంచిన 60 క్వింటాళ్ల పత్తికి నిప్పంటుకుంది. గమనించిన స్థానికులు మంటలు ఆర్పివేశారు. పత్తితో పాటు ఇంట్లోని డీజే బాక్సులు, బట్టలు కాలిపోయాయని బాధితుడు వాపోయాడు. ఘటనలో సుమారు రూ.6 లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధిత కుటుంబం కోరుతోంది. ఆర్ఐ నాందేవ్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

'గాంధారి ఖిల్లాను పరిరక్షించుకుందాం'


వనదర్శినిని ప్రారంభిస్తున్న ఎఫ్ఆర్‌వో

రామకృష్ణాపూర్: చారిత్రక నేపథ్యం కలిగిన గాంధారి ఖిల్లాను పరిరక్షించుకుందామని అటవీ అధికారులు, ప్రకృతి ప్రేమికులు, వైహెచ్ఏ(యూత్ హాస్టల్స్ అసోసియేషన్) నిర్వాహకులు పిలుపునిచ్చారు. వనదర్శిని కార్యక్రమంలో భాగంగా శనివారం మందమర్రి మండలం బొక్కలగుట్ట శివారులోని గాంధారి ఖిల్లాలో పర్యటించారు. సహజమైన ప్రకృతి అందాలు, ఖిల్లా ఎగువభాగంలోని విశిష్ట కట్టడాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం ఖిల్లా దిగువ భాగంలో శ్రమదానం చేపట్టారు. ఖిల్లాలోని జీడికోట, దర్బార్ నిర్వహించే పరిసర ప్రాంతాల్లో ఇబ్బడిముబ్బడిగా పడిఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్‌వో నగావత్ స్వామి, వైహెచ్ఏ వైస్ ప్రెసిడెంట్ శ్యాంసుందర్‌రెడ్డి, సినీగేయ రచయిత అక్కల చంద్రమౌళి, తాండూరు విద్యాభారతి స్కూల్ ప్రిన్సిపాల్ శరత్, తదితరులు పాల్గొన్నారు.

ఒకరి దారుణ హత్య

- భూ వివాదమే కారణమని అనుమానం


ఆత్రం తిరుపతి మృతదేహం

తిర్యాణి: పంటను కాపాడుకునేందుకు చేనుకు కాపాలాగా వెళ్లిన ఓ రైతును గుర్తు తెలియని వ్యక్తులు దారుణంగా హతమార్చిన సంఘటన మండలంలోని మాణిక్యపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. రెబ్బెన సీఐ అల్లం నరేందర్, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మాణిక్యపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని రాజగూడకు చెందిన ఆత్రం తిరుపతి (40) శుక్రవారం గ్రామ శివారులోని తన చేనులో కంది పంటను అడవిపందుల బెడద నుంచి కాపాడుకునేందుకు కాపలాగా వెళ్లాడు. శనివారం ఉదయం ఎంతసేపటికీ ఇంటికి రాకపోవడంతో తిరుపతి కుమారుడు ప్రసాద్ చేనులోకి వెళ్లిచూడగా మంచపైన రక్తపుమడుగులో తనతండ్రి పడి ఉండడాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించాడు. మృతుడిని గొడ్డలితో నరికి చంపినట్లుగా పోలీసులు గుర్తించారు. డాగ్ స్క్వాడ్ బృందంతో గాలింపు చర్యలు చేపట్టారు. అదే గ్రామానికి చెందిన ఆత్రం మారు, శంకర్‌పై తమకు అనుమానం ఉందని, ప్రస్తుతం సాగు చేస్తున్న భూమి తమదే అంటూ పలుమార్లు గొడవకు దిగారని మృతుని భార్య కళావతి అనుమానం వ్యక్తం చేసింది. కళావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ నరేందర్ తెలిపారు.

రిటైర్డ్ కార్మికులకు ఆరు గ్యారంటీలు

- ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు


దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

నస్పూర్: సింగరేణి సంస్థలో విధులు నిర్వర్తించి రిటైర్డ్ అయిన కార్మికులు, ఉద్యోగులకు ఆరు గ్యారంటీపథకాలు అందించేందుకు కృషి చేస్తున్నామని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు తెలిపారు. శనివారం శ్రీ లక్ష్మీ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అభయహస్తం దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 14న పట్టణ పరిధిలోని ప్రతీ ఇంటికీ ప్రతీరోజు రెండు గంటల చొప్పున స్వచ్ఛమైన శుద్ధజలం సరఫరా చేసే కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. సింగరేణి స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి పట్టాలు ఇప్పిస్తామని, అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పిస్తామన్నారు. పట్టణంలో కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకుంటామన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో శేషాద్రి, జెడ్పీసీఈవో నరేందర్, మున్సిపల్ కమిషనర్ రమేశ్, కౌన్సిలర్లు సురిమిల్ల వేణు, గెల్లు రజిత, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ గిరిజనుల అభివృద్ధికి ప్రత్యేక నిధులు


మాట్లాడుతున్న డీటీడబ్ల్యూవో గంగారాం

జన్నారం: ఆదివాసీ గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు ఏర్పాటు చేయనున్నట్లు డీటీడబ్ల్యూవో గంగారాం తెలిపారు. శనివారం మండలంలోని కొత్తపేటలో కొలాం, ఆదివాసీ గిరిజనులకు ప్రధానమంత్రి జన జాతీయ ఆదివాసీ న్యాయ అభియాన్ కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాలోని జన్నారం, దండేపల్లి, లక్సెట్టిపేట, హాజీపూర్, కాసిపేట్, తాండూర్, భీమారం మండలాల్లోని 21 గ్రామాల్లో 458 కుటుంబాలు నివాసం ఉంటున్నాయన్నారు. ఆయా గ్రామాలకు లింకురోడ్లు, శాశ్వత నివాసాలు, పైపులైన్‌ల ద్వారా నీటి సరఫరా లాంటి అభివృద్ధి పనులు చేయనున్నట్లు తెలిపారు. ఇందుకు దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం రూ. 24,104 కోట్ల నిధులు విడుదల చేసిందన్నారు. ప్రధాన మంత్రి జన్‌మన్ కార్యక్రమం ద్వారా జిల్లాలో ఆరు మల్టీపర్పస్ సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎంపీడీవో అరుణరాణి, సర్పంచ్ లావణ్య, గ్రామపెద్దలు ప్రేంసింగ్, దినేశ్‌నాయక్, బొజ్జు పటేల్ పాల్గొన్నారు.

కార్మిక సమస్యల పరిష్కారానికి సీఎండీ హామీ



మాట్లాడుతున్న వాసిరెడ్డి సీతారామయ్య

మందమర్రిరూరల్: సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి సంస్థ సీఎండీ బలరాం హామీ ఇచ్చారని గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య తెలిపారు. శనివారం యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గుర్తింపు సంఘం ధ్రువపత్రం వచ్చిన వెంటనే సమావేశాలు నిర్వహించి దఫాల వారీగా సమస్యలు పరిష్కరించుకుందామని సీఎండీ తెలిపారన్నారు. సమావేశంలో యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు అక్బర్‌అలీ, ప్రభాకర్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఫంక్షన్ హాల్ ఏర్పాటు చేయాలి

మందమర్రి ఏరియాలోని అయ్యప్ప ఆలయం పక్కనున్న ఎంవీటీసీ క్లబ్‌ను ఫంక్షన్ హాల్‌గా ఏర్పాటు చేయాలని సీతారామయ్య శనివారం జీఎం మనోహర్‌ను కలిసి వినతి పత్రం అందించారు.

జాతీయస్థాయి పోటీలకు ముత్యంపల్లి విద్యార్థులు


ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం, గైడ్ టీచర్

కాసిపేట: మండలంలోని ముత్యంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి కళోత్సవ్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరస్వామి తెలిపారు. హైదరాబాద్‌లో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి కళోత్సవ్ పోటీలలో పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థులు నవనందుల బిందుప్రియ, గాజుల నరేందర్ ప్రథమ స్థానం సాధించి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. ఈ నెల 9 నుంచి 13 వరకు ఢిల్లీలో నిర్వహించనున్న జాతీయస్థాయి కళోత్సవ్ పోటీల్లో పాల్గొననున్నారు. బిందుప్రియ తోలుబొమ్మలాటతో బాలిక విద్య, జాతీయ సమాఖ్యత, ఓటుహక్కు, కరోనా జాగ్రత్తలపై ప్రదర్శన ఇవ్వనున్నారని, నరేందర్ చిన్నయ్య సూరి పంచతంత్ర కథలో నుంచి అంశాలను తీసుకుని స్వయంగా చెక్కపొట్టు ఆధారంగా తయారు చేసిన బొమ్మలతో మంచి నాయకుడు తనను తాను రక్షించుకుంటూ ప్రజలను కూడ రక్షించాలి అనే నీతిని ప్రధానాంశంగా కథను ప్రదర్శన చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను, గైడ్ టీచర్ శాంకరీని డీఈవో యాదయ్య, ఎంఈవో ప్రభాకర్, హెచ్‌ఎం అభినందించారు.

బంక్‌లో కల్తీ పెట్రోల్ విక్రయం

- వినియోగదారుల ఆందోళన


కల్తీ పెట్రోల్ చూపిస్తున్న వినియోగదారుడు

జన్నారం: మండల కేంద్రంలో ఓ పెట్రోల్ బంక్‌లో కల్తీ పెట్రోల్ పోయడంతో ద్విచక్ర వాహనదారులు ఆందోళనకు దిగారు. బస్టాండ్ సమీపంలోని భారత్ పెట్రోల్ బంక్‌లో శనివారం సాయంత్రం ట్యాంకర్ అన్‌లోడ్ చేసింది. కొద్దిసేపటి తర్వాత కొందరు వాహనదారులు పెట్రోల్ పోయించుకున్నారు. వాహనాలు కొంత దూరం వెళ్లి ఆగిపోయాయి. మెకానిక్‌కు చూపించగా పెట్రోల్‌లో కల్తీ జరిగిందని చెప్పడంతో సదరు వ్యక్తులు అనుమానంతో బాటిల్‌లో పెట్రోల్ పోయించారు. అందులో నీరు రావడంతో ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు, ఆర్ఐ గంగరాజం అక్కడికి చేరుకున్నారు. బంక్ యాజమాని మాలవత్ సునీతజగన్‌ను ఫోన్‌లో సంప్రదించగా బంక్‌లో ఎలాంటి కల్తీ లేదని, ట్యాంకర్ ద్వారా పోసిన పెట్రోల్‌లో కల్తీ జరిగి ఉండవచ్చన్నారు. కల్తీ పెట్రోల్ వల్ల చెడిపోయిన బైక్‌లకు మరమ్మతు చేపిస్తామని ఒప్పుకున్నారు. పెట్రోల్ కల్తీ జరిగిందా? లేదా అనే విషయం తేలే వరకు బంక్‌నుంచి పెట్రోల్ క్రయవిక్రయాలు జరగవద్దని ఆర్ఐ యాజమాన్యానికి నోటీసులు ఇచ్చి ఆదేశించారు.

సమ్మక్క, సారలమ్మ జాతర ఘనంగా నిర్వహించాలి


మాట్లాడుతున్న జీఎం మనోహర్

మందమర్రిరూరల్: ఫిబ్రవరి 21 నుంచి 24 వరకు ఏరియాలోని ఆర్కే–1ఏ పాలవాగు సమీపంలో సమ్మక్క, సారలమ్మ జాతరను ఘనంగా నిర్వహించాలని ఏరియా జీఎం మనోహర్ పేర్కొన్నారు. శనివారం ఏరియా అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో జాతర ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. సమావేశంలో ఎస్వో టూ జీఎం రాజేశ్వరరెడ్డి, పర్సనల్ మేనేజర్ సల్ల శ్యాంసుందర్, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ రవీందర్, ఐఈడీ రాజన్న, డీజీఎం (సివిల్) శ్రీనివాసులు, ఏజెంట్ రామదాసు, కేకేఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక


రమేశ్, జిల్లా అధ్యక్షుడు


స్వామి, కోశాధికారి

చెన్నూర్: ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఎస్.రమేశ్, ప్రధాన కార్యదర్శిగా బి.శ్రీకాంత్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎస్.అనిల్, కోశాధికారిగా బి.స్వామి, వైస్ ప్రెసిడెంట్‌గా అల్లం దేవేందర్, జాయింట్ సెక్రటరీగా జి.సత్యం, మహిళా కార్యదర్శిగా జి.కవిత, ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా మహేందర్ ఎన్నికయ్యారు.

'భూనిర్వాసితులకు పర్మినెంట్ ఉద్యోగాలు ఇవ్వాలి'

జైపూర్: జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు భూనిర్వాసితులకు పర్మినెంట్ ఉద్యోగాలు ఇవ్వాలని హెచ్ఎంఎస్ నాయకులు శనివారం సింగరేణి సీఎండీ ఎన్.బలరాంను కోరారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో యూనియన్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ ఆధ్వర్యంలో సీఎండీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పవర్‌ప్లాంటు భూనిర్వాసితుల సమస్యలను ఆయనకు వివరించారు. ఎస్టీపీపీ హెచ్ఎంఎస్ యూనియన్ జనరల్ సెక్రటరీ విక్రం, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రదీప్, వైస్ ప్రెసిడెంట్ సంపత్, సెక్రెటరీస్ సాయికృష్ణ, మల్లేశ్, రమేశ్, నవీన్, రాజేందర్, తదితరులు ఉన్నారు.